- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పోలింగ్ ప్రశాంతం
- ఓటు హక్కు వినియోగించుకున్న అభ్యర్థులు, అధికారులు
- పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు
- సమయానికి కేంద్రంలో ఉన్న వారు ఓటేశారు..
- భారీ సంఖ్యలో తరలివచ్చిన యువ ఓటర్లు
- ఉదయం మందకొడిగా.. మధ్యాహ్నం పెరిగిన ఓటర్లు..
- ఈవీఎంలు, వీవీ ప్యాట్లు స్ట్రాంగ్ రూంలకు తరలింపు

# ఓటెత్తారు..



మంచిర్యాలలోని ఓ పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు

### నియోజకవర్గాల వారీగా..

| నియోజకవర్గం | పోలింగ్‌శాతం |
|---|---|
| ఆదిలాబాద్ | 72.10 |
| బోథ్ | 75.30 |
| ఆసిఫాబాద్ | 72.08 |
| సిర్పూర్ | 71.18 |
| మంచిర్యాల | 64.20 |
| బెల్లంపల్లి | 76.79 |
| చెన్నూర్ | 74.61 |
| నిర్మల్ | 74.68 |
| ఖానాపూర్ | 72.60 |
| ముథోల్ | 67.20 |



మంచిర్యాలలోని ఓ పోలింగ్ కేంద్రంలో ఓటు వేసి వెళ్తున్న వృద్ధురాలు

### మంచిర్యాల జిల్లాలో నియోజకవర్గాలవారీగా పోలింగ్ సరళి

| సమయం | మంచిర్యాల | బెల్లంపల్లి | చెన్నూర్ |
|---|---|---|---|
| 9 గంటలకు | 9.63 | 9.92 | 8.47 |
| 11 గంటలకు | 23.93 | 25.38 | 24.13 |
| ఒంటిగంటకు | 40.11 | 46.09 | 43.51 |
| 3 గంటలకు | 54.36 | 65.09 | 60.71 |
| 4 గంటలకు | 64.20 | 76.79 | 74.61 |

మంచిర్యాల, నవంబర్ 30(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది నియోజకవర్గాల్లో గురువారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2,857 పోలింగ్ కేంద్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడా ఈవీఎంలు మొరాయించాయి. పది నిమిషాల నుంచి అర గంట వరకు ఇబ్బంది అయింది. వెంటనే స్పందించిన అధికారులు ఈవీఎంలను మార్చడడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్నిక కొనసాగింది. సమస్యాత్మక నియోజకవర్గాలైన మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్, ఆసిఫాబాద్, సిర్పూర్‌లో పోలింగ్‌ను గంట ముందుగానే ముగించారు. సాయంత్రం 4 గంటలలోపు పోలింగ్ కేంద్రానికి వచ్చినవారందరికీ ఓటు వినియోగించుకునే అవకాశం కల్పించారు. దీంతో కొన్ని పోలింగ్ కేంద్రాల్లో రాత్రి వరకు ఓటింగ్ జరిగింది. ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ఖానాపూర్, ముథోల్ నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరిగింది. ఈ నియోజకవర్గాల్లోనూ కొన్ని ప్రాంతాల్లో కాస్త ఆలస్యమైంది.

### మధ్యాహ్నం తరువాత పెరిగిన ఓటింగ్..

పోలింగ్ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కొంచెం మందకొడిగా సాగింది. మధ్యాహ్నం 12.30 దాటిన తరువాత ఓటర్ల రాక పెరిగింది. 3 గంటలకు అధికమైంది. వ్యవసాయ పనుల నుంచి వచ్చిన కూలీలు, ఇతర పనులు చేసుకునేవారు మూడు దాటాకే కేంద్రాలకు వచ్చారు. దీంతో పలుచోట్ల పోలింగ్ ఆలస్యమైంది. దీంతో పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు రావడం ఆలస్యమైంది. రాత్రి 9 వరకు అన్ని కేంద్రాల నుంచి ఈవీఎంలు, ఎన్నికల సామగ్రి వచ్చి చేరుకుంటుందని అధికారులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి వాటిని లెక్కింపు కేంద్రాలకు తరలించనున్నారు. మంచిర్యాల జిల్లాకు సంబంధించి ఈవీఎంలు, వీవీ ప్యాట్లను హాజీపూర్ మండలంలోని ఐజా కాలేజీకి తరలించనున్నారు. మూడో తేదీన ఓట్లు లెక్కింపు ఉండనుంది.

### ఓటేసిన ప్రముఖులు

ఆదిలాబాద్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి జోగు రామన్న తన సొంత గ్రామమైన జైనథ్ మండలంలోని దీపాయిగూడలో, బోథ్ అభ్యర్థి అనిల్ జాదవ్ నేరడిగొండ మండలం రాజూరలో తమ కుటుంబసభ్యులతో, మాజీ ఎంపీ నగేశ్ తన కుటుంబ సభ్యులతో కలిసి బజార్‌హత్నూర్ మండలంలోని జాతర్లలో, కలెక్టర్ రాహుల్‌రాజ్ దంపతులు ఆదిలాబాద్‌లో ఓటు వేశారు. నిర్మల్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తన స్వగ్రామమైన ఎల్లపెల్లిలో, ఖానాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి భూక్యా జన్సన్ నాయక్ పట్టణంలోని శాంతినగర్‌లో గల పాఠశాలలో, ముథోల్ బీఆర్ఎస్ అభ్యర్థి విఠల్‌రెడ్డి తన స్వగ్రామైన భైంసా మండలంలోని దేగాంలో ఓటు వినియోగించుకున్నారు. ఆసిఫాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి తిర్యాణి మండలంలోని భీంజీగూడలో, సిర్పూర్(టి) బీఆర్ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్ప కాగజ్‌నగర్ పట్టణంలోని ఫాతిమా కాన్వెంట్ విద్యాలయంలో ఓటు వేశారు. మంచిర్యాల బీఆర్ఎస్ అభ్యర్థి దివాకర్‌రావు తన కుటుంబ సభ్యులతో కలిసి మంచిర్యాలలోని హిందీ హైస్కూల్‌లో, చెన్నూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, విప్ బాల్క సుమన్ తన సతీమణి రాణి అలేఖ్యతో కలిసి క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో క్యూలైన్‌లో నిలబడి ఓటు వేశారు. బెల్లంపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి దుర్గం చిన్నయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి నెన్నెల మండలంలోని జెండావెంకటాపూర్‌లో ఓటు వేశారు.

### చెదురుముదురు ఘటనలు..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పోలింగ్ సందర్భంగా పలు చోట్ల చెదురు మదురు ఘటనలు చోటు చేసుకున్నాయి. ఖానాపూర్ నియోజకవర్గం పెంబి మండలంలోని ఎంగ్లాపూర్ గ్రామస్తులు పోలింగ్‌ను బహిష్కరించారు. ఓటు వేసేందుకు వెళ్లకుండా వంటావార్పు చేశారు. బెల్లంపల్లి నియోజకవర్గంలోని కాసిపేట మండలంలో గల వరిపేట వాసులు పోలింగ్‌కు దూరంగా ఉన్నారు. అధికారులు సర్ది చెప్పడంతో మధ్యాహ్నం 2 గంటల తరువాత ఓటు వేశారు. బోథ్ నియోజకవర్గంలోని భీంపూర్ మండలంలో గల గొల్లగఢ్, తాంసి గ్రామస్తులు పోలింగ్‌ను బహిష్కరించారు. ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్‌కు చెందిన చంద్రగిరి రాజన్న(65), మావల గ్రామానికి చెందిన తోకల గంగమ్మ(76) ఓటు వేయడానికి వచ్చి మృతిచెందారు. మంచిర్యాల నియోజకవర్గంలోని పాత మంచిర్యాలలోని ఓ పోలింగ్ కేంద్రంలో కాంగ్రెస్ అభ్యర్థి ప్రేమ్‌సాగర్ రావు అత్యుత్సాహం ప్రదర్శించారు. పోలింగ్ ఆలస్యం కావడంతో అక్కడికి వచ్చిన ఆయన లైన్‌లో నిలుచున్న ఓటర్లకు కుర్చీలు వేయాలని అధికారులను కోరారు. అనంతరం పోలింగ్ కేంద్రం లోపలికి వెళ్లి సెల్‌ఫోన్ బయటికి తీశారు. దీంతో అక్కడున్న బీఆర్ఎస్ ఏజెంట్లు అభ్యంతరం తెలిపారు. విషయం తెలుకున్న ఇరు పార్టీల శ్రేణులు అక్కడికి రావడంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్రేమ్‌సాగర్ రావు ముందే కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులపై దాడి చేశారు. భీమారం మండల కేంద్రంలోని ఓ పోలింగ్ బూత్‌లో కాంగ్రెస్ నాయకులు గొడవకు దిగారు. ఈవీఎం బాక్సులు ఎత్తుకుపోయారని ఆరోపిస్తూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ పోలింగ్ కేంద్రానికి రావడంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. డీసీపీ రాంనాథ్ కేకన్ అక్కడికి చేరుకొని వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఈవీఎంలు పోలింగ్ కేంద్రం నుంచి వెళ్లే వరకు కాంగ్రెస్ నాయకులు అక్కడే ఉంటామని భీష్మించుకు కూర్చోవడడంతో కాస్త ఇబ్బందికరమైన వాతావరణం ఏర్పడింది. కాగజ్‌నగర్‌లో రిగ్గింగ్ చేస్తున్నారని ఆరోపిస్తూ బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు, బీఎస్పీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నాయకులు, కార్యకర్తలతో ధర్నాకు దిగారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో అక్కడికి వచ్చిన బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులతో అప్పటికే అక్కడున్న రెండు పార్టీల నాయకులు గొడవకు దిగారు. ఒకరిపై ఒకరు చెప్పులు విసురుకొని, రాళ్లు రువ్వుకున్నారు. దీంతో పోలీసులు అందరినీ చెదరగొట్టడంతో వివాదం సద్దుమణిగింది. ఈ ఘటనలో పలువురు పోలీసులకు గాయాలయ్యాయి.

### అమెరికా, కువైట్ నుంచి వచ్చి ఓటు..

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు కువైట్ నుంచి ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన సయ్యద్ మహబూబ్ అలీ వచ్చారు. గురువారం ఉదయం 7.30 గంటలకు హైదరాబాద్ చేరుకొని అక్కడి నుంచి ఆదిలాబాద్‌కు వచ్చి ఓటు వేశారు. 15 ఏండ్లుగా కువైట్‌లో ఉంటున్నానని, ప్రతి ఎన్నికకు వస్తానని తెలిపారు. సొంత ఖర్చు పెట్టుకొని వచ్చానని, తిరిగి డిసెంబర్ 2వ తేదీన వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ధోబీకాలనీకి చెందిన రంగు శ్యాంరాజ్ గౌడ్-మనోరమ దంపతులు అమెరికా నుంచి వచ్చి ఓటు వేశారు.



మంచిర్యాలలో ఎన్నికలు ముగిసిన అనంతరం స్ట్రాంగ్ రూంకు బయదేలురుతున్న సిబ్బంది

నమస్తే తెలంగాణ
CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటి పంపగలము. 9281452762, 9515108830.
NT-314461

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

# బతికుండగానే చంపేసిండ్రు..

- డెత్ లిస్ట్ లో ఓటరు పేరు..
- కేంద్రానికి వచ్చి అవాక్కైన వ్యక్తి
- అధికారుల నిర్లక్ష్యం



భాస్కర్

కౌటాల, నవంబర్ 30: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం గుడ్లబోరి గ్రామానికి హివన్కర్ భాస్కర్ గురువారం గ్రామంలోని 174 పోలింగ్ స్టేషన్‌లో తన ఓటు హక్కును వినియోగించుకునేందుకు వెళ్లాడు. ఓటరు లిస్టులో ఎపిక్ నంబర్ ఏజేపీ 1242841 ఉండగా, పోలింగ్ సిబ్బంది అతనికి స్లిప్ కూడా ఇచ్చారు. ఇక ఓటు వేసేందుకు పోలింగ్ స్టేషన్‌కు వెళ్లగా, అక్కడ ఉన్న ఎన్నికల అధికారులు నీ పేరు డెత్ లిస్ట్ (చనిపోయిన వారి లిస్ట్)లో ఉందని, ఓటు వేయడానికి లేదని తెలిపారు. నేను బతికుండగానే అలా ఎలా నమోదు చేస్తారని ప్రశ్నించాడు. అయినప్పటికీ ఉన్నతాధికారులు మాకు అందించిన లిస్ట్‌లో నీ పేరు లేదని, డెత్ లిస్ట్‌లో ఉందని అందుకని ఓటు వేయడం కుదరని వారు పంపించారు. చేసేది లేక బయటకు వచ్చిన భాస్కర్ తాను బతికుండగానే చనిపోయినట్లు రాసిన అధికారులు, తన డెత్ సర్టిఫికేట్ కూడా తన కుటుంబీకులకు అందించాలని కోరాడు. అధికారుల నిర్లక్ష్యంపై మండిపడుతున్నారు..

# కాగజ్ నగర్‌లో బీఎస్పీ అభ్యర్థి లొల్లి

- బీఆర్ఎస్ నాయకులతో గొడవ
- శ్రేణులను చెదరగొట్టిన పోలీసులు

కాగజ్‌నగర్, నవంబర్ 30: కాగజ్‌నగర్ పట్టణంలో నిర్వహించిన శాసన సభ ఎన్నికల పోలింగ్ బాహాబాహీ మధ్య కొనసాగింది. గురువారం ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ సాయంత్రం పోలింగ్ ముగిసే ముందు గొడవలు జరిగాయి. కాగజ్‌నగర్ పట్టణంలోని బీఎంఎస్ కార్యాలయం సమీపంలోని 90వ పోలింగ్ కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు రిగ్గింగ్ చేస్తున్నారని బీజేపీ పార్టీ వర్గీయులు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన చేపట్టి అధికారులను నిలదీశారు. పాల్వాయి హరీశ్ బాబు ఘటనాస్థలి నుంచి వెళ్లిపోయాక బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు, సిర్పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని పోలింగ్ కేంద్రం ఎదుట రోడ్డుపై బైఠాయించారు. కాసేపటికి జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు క్రిష్ణారావు అక్కడికి చేరుకున్నారు. ఇరువర్గాల కార్యకర్తలు దూషించుకోవడంతో పాటు వ్యతిరేక నినాదాలు చేసుకున్నారు. ఒకరిపైఒకరు చెప్పులు, రాళ్లు విసురుకోవడం ప్రారంభమైంది. దీంతో పోలీసులు చెదరగొట్టడంతో గొడవ సద్దుమణిగింది. ఇరువర్గాల వారిని చెదురగొట్టే క్రమంలో కరీంనగర్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ శ్రీనివాస్‌రావు, ఎస్ఐ గంగన్న, కానిస్టేబుళ్లకు స్వల్పంగా దెబ్బలు తగిలాయి.